ప్రజాశక్తి

బుధవారం 28 మే 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

డిపోల వద్ద రేషన్ పంపిణీకి సన్నాహాలు

వికలాంగులు, వృద్ధులకు పంపిణీపై డీలర్లలో సందిగ్ధం -దుకాణాలు దూరంగా ఉన్న ప్రాంతాల్లో ఇబ్బందులే



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రేషన్ సరఫరా విధానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులు వల్ల జిల్లాలో నిత్యావసర సరుకుల పంపిణీ అందరికి సక్రమంగా అందుతుందా లేదా అన్న అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో 15 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. 2800 రేషన్ డిపోలు ఉన్నాయి. గత నాలుగేళ్లుగా రేషన్ పంపిణీకి వినియోగిస్తున్న 901 ఎమ్‌డియు వాహనాలను ప్రభుత్వం ఇటీవల తొలగించింది. ఎమ్‌డియు వాహనాల వ్యవస్థను రద్దు చేసిన ప్రభుత్వం 2020కి ముందు మాదిరిగానే రేషన్ డిపోల ద్వారా పంపిణీకి సన్నాహాలు చేపట్టారు.

ప్రస్తుతం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొంత మంది వినియోగదారులకు రేషన్ డిపోలు కిలో మీటరుకు పైగా దూరంలో ఉన్నాయి. నగర, పట్టణ, మండల కేంద్రాల్లో అద్దెలు ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువ మంది డీలర్లు ఆయా ప్రాంతాలకు చివరి ప్రాంతాల్లో దుకాణాలను అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారు. గత నాలుగు ఏళ్లుగా రేషన్ డిపోలను ఎమ్‌డియు వాహనాలకు స్టాక్ పాయింట్‌లు ఉండటం వల్ల ఎక్కడ ఉన్నా ఇబ్బంది లేదన్నట్టు చాలామంది డీలర్లు తక్కువ అద్దెలకు వచ్చే డిపోలను చివర ప్రాంతాల్లో తీసుకుని నిర్వహిస్తున్నారు. అయితే మారిన వ్యవస్థ వల్ల ప్రజలకు డిపోలు అందుబాటులో ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎక్కువ అద్దెలు చెల్లిస్తే తమకు గిట్టుబాటు కాదని డీలర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి వాహనాలు లేని వారికి సరుకులు తెచ్చుకోవడం ఇబ్బందేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతేగాక వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకు రేషన్ ఇవ్వాలని ప్రభుత్వం రేషన్ డీలర్లకు సూచించింది. అయితే వీరికి ఎటువంటి ఛార్జీలు చెల్లించే పరిస్థితి కన్పించడంలేదు. వృద్ధులు, వికలాంగులకు సంబంధించిన వివరాలను తాము సెల్‌ఫోన్‌కు మెసెజ్ పంపుతామని, ఈ వివరాలు ఆధారంగా పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులు రెండు రోజుల క్రితం డీలర్లకు సూచించారు. ఈ మేరకు మెసెజ్‌లు పంపారు.

జూన్ 5వ తేదీన విఆర్‌వోల సమక్షంలో డీలర్లు వికలాంగులు, వృద్ధుల నుంచి బయోమెట్రిక్ తీసుకుని రేషన్ సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. తక్కువ మోతాదులో అయితే నేరుగా అందించే అవకాశం ఉంది. లేదంటే ఇతర కుటుంబ సభ్యులను రేషన్ డిపోకు రమ్మని రేషన్ అందించే అవకాశం ఉందని చెబుతున్నారు. 5వ తేదీన ▶ 2లో



దోమా రాకేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, ఇతర నాయకులు

ఆ పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- చట్టవిరుద్ధంగా వ్యవహరించిన ఘటనపై సమగ్ర విచారణ చేయాలి
- పోలీస్‌కానిస్టేబుల్‌పైనా అనేక ఆరోపణలు : సిపిఎం
- దాడికి గురైన వారి కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - తెనాలి

ముద్దాయిల అరెస్టు విషయంలో చట్టవిరుద్ధంగా, అమానుషంగా వ్యవహరించిన పోలీసులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. కానిస్టేబుల్‌పై దాడి ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసే క్రమంలో నడిరోడ్డుపై లాఠీలతో జులుం ప్రదర్శించటాన్ని ఖండిస్తూ బాధిత కుటుంబాన్ని సిపిఎం బృందం మంగళవారం పరామర్శించింది. ఐతానగర్‌కు చెందిన నిందితుల్లో ఒకరైన దోమ రాజేష్ నివాసానికి వెళ్లి, అతని తండ్రితో బృందం మాట్లాడింది. కుటుంబ నేపథ్యాన్ని, ఘటన వివరాలను తెలుసుకుంది. బాధిత కుటుంబానికి సిపిఎం అండగా ఉంటుందని నాయకులు చెప్పారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ తెనాలిలో పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమన్నారు. గత నెల 24న రాత్రి వేళలో కానిస్టేబుల్ కన్నా చిరంజీవిపై నిందితులు దాడి చేశారని, ఆ క్రమంలో దాడికి గురైన కానిస్టేబుల్‌ను వెంటపెట్టుకొని పోలీసులు 25న నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. 27 మధ్యాహ్న వరకు పోలీస్ కస్టడీలో ఉన్న నిందితులను చిత్రహింసలకు గురిచేశారని బాధిత కుటుంబీకులు చెప్పారన్నారు. దానికి తోడు బహిరంగంగా నిందితులపై పోలీసులు లాఠీలతో విరుచుకుపడిన వీడియో వారి నిరంకుశ ధోరణికి అద్దం పడుతోందన్నారు. దళితులు, మైనారిటీలు అనే కోణంలోనే పోలీసులు దాడి చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. నిందితులపై విచక్షణా రహితంగా దాడి చేయాలని ఏ చట్టంలోనూ చెప్పలేదని గుర్తు చేశారు. ఇలాంటి చర్యలతో ప్రజాస్వామ్యంలో పోలీస్ వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. కానిస్టేబుల్ పై యువకులు దాడికి పాల్పడిన ఘటన వెనుకనున్న ఆంతర్యాన్ని పోలీస్ ఉన్నతాధికారులు వెలికితీయాలన్నారు. కానిస్టేబుల్ కన్నా ▶ 2లో



మంగళగిరిలో సమైక్యతా ర్యాలీలో వామపక్ష, కాంగ్రెస్ పార్టీల శ్రేణులు

బిజెపి దుష్టత్వాన్ని సంఘటితంగా ఎదుర్కోవాలి

మతసామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ, సమైక్యత సభలో వామపక్షాలు పిలుపు

5 లో

పొలం అమ్మినా అప్పులు తీరక
కౌలురైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



శ్రీనివాసరావు (ఫైల్)

అప్పులు బాధ తాళలేక పురుగుమందు తాగి కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మాచవరం మండలంలోని పిన్నెల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పిన్నెల్లి గ్రామానికి చెందిన కొనకంచి శ్రీనివాసరావు(45) తనకున్న ఉన్న ఎకరం పొలంతో పాటుగా మరో ఆరెకరాలు కౌలుకు తీసుకొని మిర్చి, పత్తి పంటలు సాగుచేస్తున్నారు. గతేడాది పంటలకు సరైన ధరలు రాకపోవంతో నష్టం రావడంతోపాటు రూ.20 లక్షల వరకు అప్పులయ్యాయి. వీటిని తీర్చడానికి తనకున్న ఎకరం పొలాన్ని అమ్ముకోగా వచ్చిన రూ.13 లక్షలతో కొంతమేర అప్పులు తీర్చాడు. అయినా ఇంకా అప్పులు మిగిలి ఉండడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన శ్రీనివాసరావు మంగళవారం తన పొలం సమీపంలో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాస్పత్రికి తరలిస్తామని పోలీసులు చెప్పారు.

బాలుడి హత్యకేసులో పెదనాన్నకు జీవితఖైదు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని కూచినపల్లి గ్రామంలో ఆస్తికోసం తమ్ముడి కొడుకుపై పెట్రోల్ పోసి హత్య చేసిన నాశన పెదకొండయ్య (పెదనాన్న)కు జీవిత ఖైదు విధిస్తూ నరసరావుపేట 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి మంగళవారం తీర్పునిచ్చారు. ఈపూరు ఎస్ఐ యు.ఉమామహేశ్వరరావు వివరాల ప్రకారం.. కూచినపల్లి గ్రామానికి చెందిన నాశన సుబ్బయ్య, అచ్చమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా తల్లి అచ్చమ్మకు, కుమారులు నాశన పెద కొండయ్య, నాశన చిన కొండయ్యకు తరచూ ఆస్తి గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో 2019 అక్టోబర్ 17న ఆస్తి విషయంలో గొడవ జరగటంతో నాశన చిన కొండయ్య కుమారుడు నాశన రాకేష్ (14) సర్దిచెప్పి పెదనాన్న నాశన పెదకొండయ్యను అక్కడి నుండి పంపించి వేశాడు. అదేరోజు అర్ధరాత్రి ఇంటిలో ▶ 2లో

తెనాలి యువకులపై పలు కేసులు : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెనాలిలో నెల రోజులక్రితం ముగ్గురు యువకులను పోలీసులు కొట్టిన ఘటనపై విచారణ జరుగుతోందని ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ మంగళశారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటన గత నెలలో జరిగినట్లుగా తమ దృష్టికి వచ్చిందని, విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై గంజాయి మత్తులో దాడికి పాల్పడినట్టు ఫిర్యాదు అందిందని పేర్కొన్నారు. ఇది ఆమోదయోగ్యమైంది కాదని అందరూ ఖండించాలని పేర్కొన్నారు. జరిగిన సంఘటన గురించి ప్రాథమికంగా విచారించగా వేము నవీన్, చేబ్రోలు జాన్ విక్టర్, డి.రాకేష్, షేక్ కరీముల్లా అనే నలుగురు యువకులు తెనాలి టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐతా నగర్‌లో గంజాయి సేవిస్తూ దానికి బానిసలుగా మారి సామాన్య ప్రజలపై తరచూ దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో తెనాలి 2వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటూ తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కన్నా చిరంజీవి అనే కానిస్టేబుల్ ఇంటికి వెళ్లే సమయంలో అతనినీ అడ్డగించి అప్పటికే గంజాయి మత్తులో ఉన్న నలుగురు యువకులు అతనిపై అకస్మాత్తుగా దాడి చేసి చంపడానికి ప్రయత్నం చేసినట్టు ఎస్‌పి పేర్కొన్నారు. ఈ ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసి ముగ్గుర్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. వీరిపై అప్పటికే తెనాలి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్స్ కూడా నమోదై ఉన్నాయని, వీరు గంజాయి, హత్యాయత్నం, దోపిడి, కొట్లాటలు, దొంగతనాలు, మహిళలపై దాడి చేయడం వంటి పలు కేసుల్లో నిందితులుగా ఉంటూ జైలు కూడా వెళ్లి వచ్చారని పేర్కొన్నారు. నవీన్‌పై 10 కేసులు, చేబ్రోలు జాన్ విక్టర్‌పై 10 కేసులు, దోమ రాకేష్‌పై 9 కేసులు, షేక్ కరీముల్లాపై ఒక కేసు ఉన్నట్టు ఎస్‌పి తన ప్రకటనలో పేర్కొన్నారు.

31న హైదరాబాదు సాహితీ ఉత్సవంలో రెండు సంకలనాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - తెనాలి


రచయిత నూతలపాటి నాగేశ్వరరావు

ఈనెల 31న హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియంలో కస్తూరి విజయం ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఇంక్ బౌండ్ పేరిట నిర్వహించే సాహితోత్సవంలో రచయిత నూతలపాటి నాగేశ్వరరావు సంపాదకత్వంలో వెలువడిన కథల పరిమళాలు, కవితా కెరటాలు సంకలనాల ఆవిష్కరణ జరుగుతుందని ఆయన సోమవారం తెలిపారు. పొరుగు రాష్ట్రాలు, ఇతర దేశాలకు చెందిన పలువురు కవులు రచించిన కవితలతో కవితా కెరటం సంకలనం రూపొందిందని, కథా రచయితల కథలతో కథల పరిమళాలు సంకలనం రూపొందిందని, ఈ రెండింటిలో తెనాలి ప్రాంతానికి చెందిన 15 మంది కవుల రచనలు ఉన్నాయన్నారు. నాగేశ్వరరావు రచించిన కథల కదంబం, అమలత కలశం, ప్రేమ అక్షయం, జీవన కేళి, మిస్టర్ డేవిడ్ నవలలు చాలా ప్రాచుర్యం పొందాయి. ఆయన రచనలలో కథల కదంబం నవల ది బీటింగ్ హార్ట్ పేరుతో ఆంగ్లంలోకి అనువదించబడిందని ఆయన తెలిపారు. పలువురు కవులు కథకులు రచయితలు, పాల్గొనే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భారత హోమ్ వ్యవహారాల శాఖ రాష్ట్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గౌరవ అతిథిగా పాల్గొంటారని చెప్పారు. సాహితీప్రియులు సంకలనాల ఆవిష్కరణను విజయవంతం చేయాలని ఆయన కోరారు.



తొలి ప్రధాని నెహ్రూకు నివాళి

ప్రజాశక్తి - రెంటచింతల

భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 62వ వర్ధంతిని మోడల్ స్కూల్, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలీన విధానం రూపొందించి అమలు చేయడంలో నెహ్రూ కృషిని గుర్తు చేసుకున్నారు. ప్రిన్సిపాల్ పాపారావు, మోహన్, విద్యావేత్త నారాయణపురం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు కోటప్పకొండలో యోగా శిక్షణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యోగాంధ్ర 2025 నెలరోజులపాటు ఇచ్చే యోగా శిక్షణ శిబిరాలు, పోటీలు, బోధన కార్యక్రమాలలో భాగంగా పల్నాడు జిల్లాలో కీలక పర్యాటక ప్రదేశాలలో యోగా శిబిరాలు నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం ఉదయం 6.30లకు కోటప్పకొండ శైవక్షేత్రం వద్ద ప్రకృతి వాతావరణంలో యోగా శిబిరం నిర్వహిస్తామని, వచ్చే నెల 5న నాగార్జునసాగర్‌లో, 11న కొండవీడు కోట, జూన్ 18న అమరావతి వద్ద నిర్వహిస్తామని వివరించారు. ఈ నెల 26 నుండి వచ్చే నెల 20 వరకు ప్రతిరోజు ఒక ఇతివృత్తంతో కార్యక్రమాల్ని నిర్వహిస్తామన్నారు. వచ్చేనెల 5న ఎఎన్ఎం, ఆశాలతో సామూహిక యోగ నిర్వహణకు సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. యోగాంధ్ర మాసోత్సవ వేడుకలలో భాగంగా స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం రోడ్డుకు యోగా స్ట్రీట్‌గా పేరు పెడుతున్నట్లు తెలిపారు. యోగాంధ్ర యాప్ ద్వారా యోగా ఔత్సాహికుల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో 8 లక్షల మందిని యోగా ఔత్సాహికులను నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటి వరకూ లక్ష మంది నమోదు పూర్తయిందన్నారు. వీరితో పాటూ 4,800 వరకూ మాస్టర్ ట్రైనర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

ఖాళీ స్థలాల్లో పెరిగిన కంపచెట్లు

విష సర్పాల సంచారం - ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో ఖాళీస్థలాల్లో పెద్ద ఎత్తున పిచ్చి చెట్లు పెరిగి పెద్దవై అడవిని తలపిస్తున్నాయి. పిచ్చి మొక్కలతో మొదుగ్గా ఉండటంతో విష సర్పాలకు అవి స్థావరంగా మారాయి. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని మా లక్ష్మమ్మ చెట్టు వద్ద నుండి పద్మశాలీల బజార్ పైకెళ్ళే దారిలో రోడ్డు కిరువైపులా పెద్ద ఎత్తున పిచ్చి చెట్లు మొలిశాయి. వీటితోపాటు రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తున్నాయి. వీటికి తోడు ఎక్కడెక్కడ నుంచి తీసుకొచ్చిన వ్యర్థాలను సంచులతో నింపి ఇక్కడ రోడ్డు పక్కన పడేస్తున్నారు. వీటన్నిటికి తోడు కొండచిలువు లాంటి భయంకరమైన విష సర్పాలు ఇక్కడ సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఉదయాన్నే లేచి ఇంటి ముందుకు వస్తే ఎటువంటి విషసర్పాలను చూడవలసి వస్తుందేమోనని ఇళ్లల్లో నివాసస్తులు భయపడుతున్నారు. వారం రోజుల వ్యవధిలోనే భయంకరమైన రెండు పాములను స్థానికులు చూసిన వెంటనే చంపేసామని చెబుతున్నారు. కాళీ స్థలంలో పెద్ద ఎత్తున సెంట్రింగ్‌కు సంబంధించి చెక్కలు, ఇనుప సామాగ్రి నిల్వ ఉంచటంతో పాములు, తేళ్లు, జర్రులు, మండ్రగబ్బ లాంటివి చేరుతున్నాయని ఖాళీ స్థలాల పక్కన నివాసం ఉంటున్న ప్రజలు వాపోతున్నారు. ఖాళీ స్థలాలను యజమానులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, లేనట్లయితే భారీ ఎత్తున జరిమానాలు విధిస్తామని, మున్సిపల్ అధికారులు చేస్తున్న హెచ్చరికలు అమలకు నోచుకోవటం లేదు. కాళీ స్థలాలను అలా వదిలేస్తే మున్సిపల్ కార్యాలయంకు సంబంధించి బోర్డులు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన అధికారులు సంవత్సరాలు గడిచిన ఇంతవరకు కార్యచరణకు దిగలేదు. ఫలితంగా పట్టణంలో ఎక్కడికి అక్కడ ఖాళీగా స్థలాలు పడి ఉన్నాయి. వర్షాకాలం కావడంతో, గత వారం రోజుల నుండి తాడేపల్లిలో పెద్ద ఎత్తున వర్షాలు కురవడంతో పుట్టలో ఉన్న పాములు బయటకు వచ్చి తమకు ఆవాసంగా మారిన ఖాళీ స్థలాల్లో నివాసం ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఆపై పక్కనే ఉన్న ఇళ్లల్లోకి వచ్చి ఇళ్ల యజమానులను భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా పద్మశాలియ బజార్ ప్రాంతంలో కొండ పై భాగం నుండి విష సర్పాలు కిందకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు పక్కన ఉన్న పిచ్చి చెట్లను తొలగించడంతో పాటు ఖాళీ స్థలాల్లో అడవిని తలపిస్తున్న పిచ్చి చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.







డిపోల వద్ద రేషన్ పంపిణీకి సన్నాహాలు

(మొదటి పేజీ తరువాయి)

వృద్ధులు, వికలాంగులకు బయోమెట్రిక్ తీసుకున్న తరువాతనే సంబంధిత కుటుంబంలో ఎవరు ఉంటే వారే డీలరు డిపో వద్దకు వచ్చి తీసుకునేలా ఏర్పాట్లు చేస్తారని ఇది డీలర్లకు, వినియోగదారులకు ఉన్న అనుసంధానాన్ని బట్టి ఉంటుందని అంటున్నారు. అయితే అన్న అంత్యోదయ పథకంలో కొంత మందికి 35 కిలోల బియ్యం కూడా అందుతున్నాయి. ఇంత భారీగా బియ్యం ఇంటికి తీసుకువెళ్లి ఇవ్వడం తమకు కూడా కష్టమేనని ఏదో భారీ వాహనం వినియోగించకతప్పదని డీలర్లు తెలిపారు. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 17వ తేదీ వరకు డిపోలు తెరచి ఉండాలని నిర్దేశించారు. అందువల్ల వినియోగదారులు ఎప్పుడైనా రేషన్ తీసుకోవచ్చునని అధికారులు తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని డిపోలకు జూన్‌నెల కోటాకు సంబంధించి బియ్యం, పంచదార దుకాణాలకు చేరుతున్నాయి.

బాలుడి హత్యకేసులో పెదనాన్నకు జీవితఖైదు

(మొదటి పేజీ తరువాయి)

నిద్రిస్తున్న రాకేష్‌పై పెదకొండయ్య పెట్రోల్ పోసి నిప్పు పెట్టాడు. గమనించిన రాకేష్ తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆ మంటలను ఆర్పి అతన్ని నరసరావుపేట గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడినుండి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తీసుకెళ్లారు. చికిత్స పొందే క్రమంలో రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాశన పెద కొండయ్యపై అప్పటి సిఐ ఎం.వి సుబ్బారావు, ఎస్సై జి.అస్సన్ కేసు నమోదు చేశఉ. చికిత్స పొందుతున్న రాకేష్ 2019 అక్టోబర్ 28న మృతి చెందాడు. ఈ కేసులో విచారణను పూర్తి చేసిన ఎస్ఐ యు.ఉమామహేశ్వరరావు ఛార్జిషీటును దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి వాదనలు వినిపించారు.


మాట్లాడుతున్న వై నేతాజీ

ఆ పోలీసులపై చర్యలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

చిరంజీవి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పలు అభియోగాలు తమ దృష్టికి వచ్చాయన్నారు. పరామర్శించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భావన్నారాయణ, తెనాలి కార్యదర్శి కె.బాబు ప్రసాద్, ఎం.శివసాంబిరెడ్డి ఉన్నారు.

గ్రామాల్లో జూన్ 21 వరకు యోగాంధ్ర శిక్షణ

ప్రజాశక్తి చేబ్రోలు

మండల స్థాయి యోగాంధ్ర శిక్షణా కార్యక్రమంను మండల కేంద్రంలోని గాలి గోపురం వద్దనున్న కమ్యూనిటీ మీటింగ్ హాలులో నిర్వహించారు. జూన్ 2వ తేదీ వరకు ఐదు రోజులు పాటు సచివాలయ సిబ్బందికి మండల స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఎంపీడీవో ఏ ఉమాదేవి తెలిపారు. మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో అన్ని గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు మరియు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వీరందరికీ శిక్షణను అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ ఉమాదేవి, మండల విద్యాశాఖ సుబ్బారావు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్షేమమైన , ప్రశాంతమైన , ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడిపేందుకు ఐదు సూత్రాలను పాటించాలని అన్నారు. స్వేచ్ఛగా ప్రశాంతంగా శాంతియుతంగా గడపాల్సిన ఖాళీ సమయాలను అధిక భాగం పెద్దలనుంచి పిల్లల వరకు అధిక రేడియేషన్‌కు గురయ్యే విధముగా సెల్ ఫోను లకు అటాచ్ అవుతున్నారని ఇది మంచిది కాదని అన్నారు. కోవిడ్ సమ యంలో చాలావరకు ఆరోగ్య సంబంధిత అలవాట్లు అందరూ పాటించారని అన్నారు. కార్యక్రమ ంలో వెలుగు ఎపిఎం శ్రీలక్ష్మి, మండల కోఆర్డినేటర్ స్వచ్ఛ భారత్ మిషన్ , పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపినందుకు రూ.10వేలు జరిమానా

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆత్మకూరు జంక్షన్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆత్మకూరు గ్రామానికి చెందిన కొండపల్లి సాయి మణికంఠ వ్యక్తి మద్యం తాగుతూ వాహనం నడుపుతుండగా మంగళగిరి పోలీసు లు పట్టుకొని కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వారు సదరు వ్యక్తికి రూ.10వేలు జరిమాన జరిమానా విధించిందని పోలీసులు తెలిపారు. కావున మండల ప్రజలందరూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ఏ ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.



రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం.. తెనాలి పోలీసుల అత్యుత్సాహం

పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపణలు

ప్రధాన భూమిక పోషించిన కానిస్టేబుల్‌పైన ఆరోపణలు

ప్రజాశక్తి తెనాలి

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన తెనాలి పోలీసుల వైఖరిపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. అసాంఘిక శక్తులకు భయం కలిగించే రీతిలో వ్యవహరించామని పోలీసులు ఒకవైపు జబ్బలు చరుచుకుంటుంటే, చట్టాన్ని సమర్థవంతంగా నడిపించాల్సిన పోలీసులే విచక్షణ కోల్పోయి చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారని మరోవైపు విమర్శలు విని పిస్తున్నాయి. ఈ కేసులో నిందితుల అరెస్టు సమయంలో టూ టౌన్ సిఐ రాముల నాయక్ ఏమన్నారంటే గత నెల 24న తెనాలి పట్టణ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కన్నా చిరంజీవిపై నలుగురు వ్యక్తులు దాడి చేశారని, ఆ కేసులో ఎ1 ముద్దాయిగా ఉన్న రౌడీ షీటర్ వేము నవీన్ అలియాస్ కిల్లర్ పరారీల ఉండగా చేబ్రోలు జాన్ విక్టర్, షేక్ బాబూలాల్ అలియాస్ కరిముల్లా, దోమ రాకేష్ ను గత నెల 27న అరెస్టు చూపించారు. వాస్తవానికి 24న దాడి జరిగితే 25న కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారు. అదే రోజు ఫిర్యాదు చేసిన కానిస్టేబుల్‌తో సహా నిందితుల ఇళ్లకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. అప్పటికీ విషయాన్ని పోలీసులు బహిర్గతం చేయలేదు. 26న ఎస్పి సతీష్ కుమార్ తెనాలి డిఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో డిఎస్పి తో పాటు పట్టణంలోని సీఐలతో ఆయన కానిస్టేబుల్ పై జరిగిన దాడి ఘటన పై సమీక్ష జరిపినట్లు సమాచారం. దీనిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు 27న నిందితులను అరెస్టు చూపారు. అరెస్టు సమయంలో నిందితులకు థర్డ్ డిగ్రీ ప్రయోగించి, అసాంఘిక శక్తులలో అలజడి రేకెత్తించాలని మాత్రమే ఆలోచించారు. అసలు గొడవకు బాధ్యుడైన కానిస్టేబుల్ వైఖరిపై కనీసం ఆలోచన చేయలేదని, 25న నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు 27 వరకు వారిని కనీసం బాధిత కుటుంబ సభ్యులకు కూడా చూపించలేదని వారు ఆరోపిస్తున్నారు. అయితే తాజాగా నిందితులపై పోలీసులు లాఠీలతో దాడి చేసిన వీడియో బయటకు పొక్కడంతో నిందితుల కుటుంబాలలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ చర్యలను ఉపేక్షించేది లేదని కచ్చితంగా పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామంటున్నారు. తమ కుమారుడు రాకేష్ ఓ యాక్సిడెంట్‌లో గాయపడ్డాడని కాలులో, చేతిలో ఇనుప రాడ్ ఉందని, ఆ విషయాన్ని పోలీసులకు చెప్పినా వినకుండా సిఐ రాముల నాయక్ తమ కుమారుడి కాళ్లపై నుంచుంటే, త్రీ టౌన్ సిఐ లాఠీతో కొట్టారని రాకేష్ కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. అయితే పోలీసులు మాత్రం ఈ ఘటనపై నోరు మెదపటం లేదు. అసాంఘిక శక్తులలో భయం కలిగించేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నట్లు చెప్పుకుంటున్నా, దానిని చట్టపరంగా సమర్థించే పరిస్థితి లేదు. కోర్టులు చట్టాలు ఉండగా వాటిని అతిక్రమించి పోలీసులు తీసుకున్న చర్యలు సర్వత్రా విమర్శలకు భావిస్తుంది.



నిందితులపై సిఐలు దాడి దశ్యం (ఫైల్ ఫోటో)

వీడియో ఎలా వెలుగు చూసింది?

నిందితుల అరెస్టు జరిగిన సరిగ్గా నెల రోజులకు వీడియో వెలుగు చూడటం పోలీస్ వర్గాల్లో చర్చనీయా ంశమైంది. కేవలం శాఖా పరంగా అవసరమైనప్పుడు అసాంఘిక శక్తులకు చూపేందుకు పోలీసులు తీయించిన వీడియో బయటకు ఎలా వచ్చిందన్న దానిపై పోలీసులు విచారిస్తున్నారు. ఆ వీడియోను స్టేటస్ పెట్టుకున్న ఓ న్యాయవాదిని నేరుగా డి.ఎస్.పి పిలిపించి విచారించినట్లు సమాచారం. పైగా అతనిపై ఆంక్షలు విధించేందుకు పోలీసులు ప్రయత్నించిన సమయంలో పలువురు న్యాయ వాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదిని బయటకు తీసుకు వచ్చినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే ఇప్పటివరకు రహస్యంగా ఉన్న వీడియో పోలీసులలోనే పొసగక బయటకు వచ్చినట్లు వదంతులున్నాయి.

కానిస్టేబుల్ పై పలు ఆరోపణలు

తనపై దాడి చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన కానిస్టేబుల్ కన్నా చిరంజీవిపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో అతను 3 టౌన్‌లో కూడా పని చేశాడని ప్రస్తుతం ఒన్ టౌన్‌లో పనిచేస్తూ టూ టౌన్ ఏరియాలో నివాసముంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గంజాయి, పాత కేసులలో నిందితులను తరచుగా బెదిరిస్తూ, వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేయడం అతని వైఖరిగా బాధిత కుటుంబీకులు చెబుతున్నారు. ఆ ప్రయత్నంలోనే యువకులతో ఘర్షణకు దిగి, కేసులు పెట్టించినట్లు చెబుతున్నారు. అతని ఫోన్ కాల్స్, అకౌంట్లో నగదు లావాదేవీలను పోలీసులు క్షుణంగా పరిశీలిస్తే ఖచ్చితంగా అతని నైజం బయటపడే అవకాశం ఉందంటున్నారు. దీనికి తోడు పోలీసు అధికారులను తన వసూళ్లలో భాగస్వాములను చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడానికి కూడా అదే కారణమని వినికిడి. ఈ పరిణామాలను సిపిఎం, వైసిపితో పాటు, పలు ప్రజా సంఘాలు కూడా ఖండిస్తున్నాయి.

ప్రభుత్వ తప్పుడు విధానాలనే పోలీసులు అమలు చేస్తున్నారు

- ఎన్సీఆర్‌బి రికార్డులలో ఏపీ ప్రథమ స్థానంలో ఉండటం సిగ్గుచేటు

- తెనాలిలో పోలీసుల అమానుష చర్యలపై వైసిపి ధ్వజం

ప్రజాశక్తి తెనాలి

రాష్ట్రంలో ప్రభుత్వం తప్పుడు విధానాలను అమలు చేస్తుంటే ఆ దారిలోనే పోలీస్ అధికారులు కూడా పయనిస్తున్నారని రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ధ్వజమెత్తారు. కానిస్టేబుల్ పై దాడి కేసులో నిందితులపై పోలీసులు నడిరోడ్డుపై లాఠీలతో విరుచుకుపడటాన్ని వైసిపి తీవ్రంగా ఖండించింది. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాగార్జున మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ విలువలకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. రాష్ట్ర నలుమూలల ఎక్కడ చూసినా దళితులపై దాడులు పెరిగిపోయాయని చెప్పారు. చివరికి దళిత ఎమ్మెల్యేతోనే దళితులు గంజాయి సేవిస్తారని చెప్పించడం సిగ్గుచేటన్నారు. నందికొట్కూరు లాకప్‌డెత్ మొదలు ఆదోని, ఉరవకొండ ఘటనలను ఆయన ప్రస్తావించారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం నేరాలలో ఏపీ ప్రథమ స్థానంలో ఉండటం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని వ్యవహరిస్తున్న పోలీసు చర్యలను చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ ఏ కేసులో నిందితులైన చట్టప్రకారం శిక్షింపబడాల్సిందేనని, దానికి భిన్నంగా తెనాలిలో పోలీసులు వ్యవహరించారన్నారు. గతంలో తెనాలిలో ఎన్నడూ లేని సంస్కృతికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. సభ్య సమాజం తలదించుకునే విధంగా పోలీసు వ్యవస్థ వ్యవహరించటం అత్యంత బాధాకరమన్నారు. దళిత, మైనారిటీలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా పోలీసులు వ్యవహరించారన్నారు. ఎమ్మెల్సీ మొండితోక అశోక్ కుమార్ మాట్లాడుతూ తెనాలిలో పోలీసుల చర్యలు నూటికి నూరు శాతం మానవహక్కుల ఉల్లంఘన అన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ప్రభుత్వం ఇప్పటివరకు ఓ పార్టీ మీదే ప్రదర్శిస్తే పోలీసులు దళిత, మైనారిటీలపై ప్రదర్శించారని విమర్శించారు. దళితులకు మైనారిటీలకు రాష్ట్రంలో జీవించే హక్కు లేదా అని ప్రశ్నించారు. వైసిపి జిల్లా మాజీ అధ్యక్షులు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ లేదని, గురజాలలో కూడా సీఐ వ్యవహార శైలి, తెనాలి పోలీసుల వ్యవహార శైలి ఇందుకు నిదర్శనమన్నారు. వైసిపి నాయకులు వరికూటి అశోక్ కుమార్ తదితరులు పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యలకు బాధ్యులైన పోలీసులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిహెచ్ సురేష్, సిహెచ్ శ్రీనివాసరావు, తాడి బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్, నాగార్జున తదితరులు

నిందితులపై పోలీసుల దాడికి బిఎస్‌పి ఖండన

ప్రజాశక్తి - తెనాలి

చట్టాన్ని ఉల్లంఘించి అత్యుత్సాహం ప్రదర్శించిన తెనాలి పోలీసుల వైఖరిని బహుజన సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఘటన వివరాలు తెలుసుకునేందుకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కూరపాటి సుబ్బారావు నేతృత్వంలోని బృందం మంగళవారం స్థానిక ఐతానగర్ పొట్టి శ్రీరాములు పార్కులో సమావేశమైంది. నిందితులలో ఒకరైన చేబ్రోలు జాన్ విక్టర్ తండ్రితో మాట్లాడారు. పోలీసుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని, అమానుషగా ప్రవర్తించిన పోలీసుల పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిఎస్పీ జిల్లా పార్లమెంటు ఇంచార్జి తెనాలి ప్రకాష్, నాయకులు గూడవల్లి మణికుమార్, చింతనగండ్ల వాసు, కారుమంచి సునీల్ సందీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిఎస్పీ నాయకులు

మోటార్ల వైరు చోరీ

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని కొత్తూరు ఆంజనేయ స్వామి గుడి సమీపంలో ఎంటిఎంసి వాటర్ వర్క్స్ చెందిన నాలుగు మోటర్లకు సంబంధించిన వైర్లను గుర్తు తెలియని దుండగు లు సోమవారం తెల్లవారుజామున కత్తిరించుకొని ఎత్తుకు పోయారు. వైర్లను భూమి అంచుదాక తగ్గటంతో జాయిం ట్ చేయడానికి కూడా వీల్లేకుండా పోయిందని ఇంజనీరింగ్ సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో వరుస దొంగతనాలు జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



పిచ్చికుక్క దాడిలో 10 మందికి గాయాలు

ప్రజాశక్తి - కొల్లిపర

పిచ్చికుక్క స్వైర విహారం చేసి పదిమంది గ్రామస్తులను గాయపరిచిన ఘటన మంగళవారం కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామంలో చోటుచేసుకుంది. గాయపడిన వారిని కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందజేస్తున్నారు. వీరిలో నలుగురకు తీవ్ర గాయాలవడంతో చికిత్స నిమిత్తం తెనాలి వైద్యశాలకు పంపినట్లు డాక్టర్ సుప్రియ తెలిపారు. మిగిలిన వారికి యాంటీ రాబిట్ ఇంజక్షన్ చేసి ఇంటికి పంపించి నట్లు ఆమె తెలిపారు పిచ్చికుక్క గ్రామం నలుమూలలా తిరిగి గ్రామస్తులను కరవటమే కాక కుక్కలను కూడా కరిచిందని ఆ కుక్కలకు కూడా పిచ్చి ఎక్కుతుందేమోనని గ్రామస్తులు భయపడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆ కుక్క లను పట్టుకొవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పురుగుమందు తాగి మృతి

ప్రజాశక్తి - నకరికల్లు

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళగవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని దేచవరం గ్రామానికి చెందిన వల్లెపు సుబ్బారావు(60) కూలి పనులు చేసుకుని జీవిస్తుంటాడు. గత ఆరు నెలలుగా గొంతు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. మూడు నెలల క్రితం గుంటూరులోని వైద్యశాలలో ఆపరేషన్ చేయించుకున్నాడు. అనారోగ్యంతో తీవ్ర మనస్థాపానికి గురై ఈ నెల 26వ తేదీన మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గడ్డి మందు తాగాడు. హుటా హుటిన 108లో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించిగా మెరుగైన వైద్య చికిత్స కోసం గుంటూరు జిజిహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళ వారం మృతి చెందినట్లు తెలిపారు. మృతిని భార్య వీరమ్మ ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - నకరికల్లు

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం నరసరావుపేట మండలం పవిడిపాడు గ్రామానికి చెందిన లింగాల గోపి మరియు బొమ్మ కంట శివ మణికంఠ ద్విచక్ర వాహనంపై కండ్లకుంటలో గల తన స్నేహితుడు వద్దకు వచ్చారు . మరల తిరిగి ఇద్దరు ద్విచక్ర వాహనంపై పమిడిపాడు బయలు దేరారు. కండ్లకుంట విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఇరువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ లింగాల గోపి మంగళవారం మృతి చెందాడు. చికిత్స పొందుతున్న శివ మణికంఠ అన్నయ్య వంశీ ఫిర్యాదు వరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సురేష్ తెలిపారు.



జెఎన్‌టియు కాంట్రాక్ట్ అధ్యాపకుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - నరసరావుపేట

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందులుపెడుతున్నారని నరసరావుపేట జెఎన్‌టియు కాంట్రాక్ట్ అధ్యాపకులు మంగళవారం విధులను బహిష్కరించారు. ప్రిన్సిపాల్ రూమ్‌ను ముట్టడించారు. ఇంటర్వ్యూలు లేకుండా రెన్యూవల్ చేయాలని, బ్రేక్ పీరియడ్‌ను 15 రోజుల నుండి 5 రోజులకు తగ్గించాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.



వేధింపులు, చట్టాలపై న్యాయవిజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - వినుకొండ

లైంగిక వేధింపులు, చట్టాలపై మహిళలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అవగాహన కల్పించారు. న్యాయమూర్తి మహతి పలు అంశాలను వివరించారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, ఎస్సై కత్తి స్వర్ణలత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ప్రధాన కాల్వల్లో పూడికతీత పనులు

ప్రజాశక్తి - వినుకొండ

భారీ వర్షాలొచ్చిన డ్రెయినేజీ, పారిశుధ్య సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. మున్సిపాల్టీ పరిధిలోని ప్రధాన మురుగు కాల్వల్లో పూడిక తీయిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం పట్టణానికి కేటాయించిన రూ.44.59 లక్షలు వెచ్చిస్తున్నారు. రెండ్రోజులుగా పట్టణంలోని అంబేద్కర్ కాలనీ, శృగారపు వనం, పల్నాడు రోడ్డు మెయిన్ డ్రెయినేజీ, మార్కాపురం రోడ్డు మెయిన్ డ్రెయిన్ డబ్బా స్తంభం సెంటర్, కోట్నాల్స్ బజార్ తదితర ప్రాంతాల్లో పనులు చేయిస్తున్నారు. పనులను కమిషనర్ సుభాష్ చంద్రబోస్, మున్సిపల్ ఇంజినీర్ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ పర్యవేక్షిస్తున్నారు.

మృతదేహాలను అప్పగించకపోవడం దారుణం

ప్రజాశక్తి - వినుకొండ

మావోయిస్టు మృతదేహాలను కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా అంత్యక్రియలు చేయడం చట్ట వ్యతిరేకమని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక సురేష్ మహల్ సెంటర్లో మంగళవారం నిరసన తెలిపారు. పిడిఎం రాష్ట్ర నాయకులు వైవీ, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్.చిన్న, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

మరింత నష్టాల్లో ముంచొద్దు

పొగాకు రైతుల ఆవేదన - రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఐటిసి ఎదుట నిరసన దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పొగాకు కంపెనీల తీరు వల్ల ఇప్పటికే తాము తీవ్ర నష్టాల్లో మునిగిపోయామని, నిండా ముంచొద్దని పొగాకు రైతులు కోరుతున్నారు. బర్లీ పొగాకును మద్దతు ధరకు కొనాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఐటిసి ప్రధాన కార్యాలయం వద్ద రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో రైతులు, నాయకులు మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ముఖ్యఅతిథిగా సమితి రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు హాజరై మాట్లాడారు. దీక్షలను నల్లమడ రైతుసంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు ప్రారంభించి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అమెరికాలో 60 శాతం, ఆఫ్రికా, యూరప్ దేశాల్లో 40 శాతం బర్లీ పొగాకు సాగవుతుందని, అయితే ఈ ఏడాది అమెరికా, యూరప్ దేశాల్లో సరిగా పండలేదని, ఈ నేపథ్యంలో ఇండియాలోని పొగాకుకు డిమాండ్ పెరిగిందని చెప్పారు. అయితే కంపెనీలు కుమ్మక్కయ్యి ధరలను తగ్గించాయన్నారు. రైతు ఉద్యమాల వల్ల అక్కడక్కడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా తూతూమంత్రమేనన్నారు. రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 6 జిల్లాల్లో నల్లబర్లీ పొగాకు సాగైందని, గతేడాది నాణ్యమైన ఆకును రూ.18 వేలకు, నాణ్యతలేని దాన్ని రూ.10-15 వేలకు కొన్నారని, ఈ ఏడాది ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కెవిపి ప్రసాద్ మాట్లాడుతూ చివరి ఆకు వరకూ కంపెనీల వారితో కొనిపించాలని, లేదా ప్రభుత్వమైనా కొనాలని డిమాండ్ చేశారు. సుబాబుల్ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమాన్‌రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, రుణాలు మాఫీ చేసి అప్పుల బాధ నుండి వారిని కాపాడాలని కోరారు. అనంతరం సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్.బాబు, బి.కోటా నాయక్, టి.ప్రతాపరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ, లోక్‌సత్తా నాయకులు భానుప్రసాద్, మహిళా సమైక్య నాయకులు నిర్మల, పలు జిల్లాల రైతులు పాల్గొన్నారు.



దీక్షలను ప్రారంభించి మాట్లాడుతున్న డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు

ఇదీ రైతుల ఆవేదన..



మూడెకరాల్లో పొగాకు సాగు చేయగా 34 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, క్వింటాళ్ రూ.15 వేలకు అమ్ముకున్నా రూ.లక్ష నష్టమొస్తోందని, ఇంకా తక్కువకు కొంటే తాము పూర్తిగా ఆరిపోవడమేనని ప్రత్తిపాడు మండలం మేడవారిపాలేనికి చెందిన నాగరాజు, వీరశేఖరబాబు తెలిపారు.



పదేకరాల్లో 150 క్వింటాళ్ల దిగుబడి రాగా ఒక్క క్వింటాళ్ కూడా అమ్మలేదని, ఇప్పటికే రంగుకూడా మారుతోందని పెదనందిపాడు మండలం కాట్రపాడుకు చెందిన వలేటి ఆనందరావు ఆవేదనకు గురయ్యారు.



తాను సాగుచేసిన 30 ఎకరాల్లో 350 క్వింటాళ్ల దిగుబడి రాక క్వింటాళ్ రూ.15 వేలకు అమ్మినా ఎకరాకు రూ.25 వేలు చొప్పున రూ.7.5 లక్షల నష్టం కనిపిస్తోందని చిలకలూరిపేటలకు చెందిన మాయకోటి జ్యోస్నా రామలింగేశ్వరరావు తెలిపారు. అనేక వడిదుడుకులను ఎదురొడ్డి సాగు చేశామని తెలిపారు. ఇదే ఆవేదనను చిలకలూరిపేట మండలం వేలూరుకు చెందిన అయూబ్‌ఖాన్ సైతం వ్యక్తం చేశారు. తాను 150 ఎకరాల్లో పొగాను వేసి వెయ్యి క్వింటాళ్లను అమ్మాల్సి ఉందని తెలిపారు.



విజయవంతంగా ముగిసిన 'బాసట' సమ్మర్ క్యాంప్

స్కాలర్‌షిప్ టెస్ట్, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు.. మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ మహబూబ్ సుభాని

ప్రజాశక్తి - యడ్లపాడు

బాసట సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు ముగిసిన సందర్భంగా ముగింపు కార్యక్రమాన్ని స్థానిక జెడ్‌పి పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి నూతలపాటి కాళిదాసు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డిఇఒ షేక్ మహబూబ్ సుభాని మాట్లాడుతూ విద్యార్థులు సమయ పాలన, క్రమశిక్షణ అలవర్చుకోవాలని, పాఠ్యాంశానికి సంబంధించి ప్రశ్నలు వేయడం ద్వారా ఆ సబ్జెక్టుల పట్ల లోతైన అవగాహన పెరుగుతుందని చెప్పారు. వేసవిలో విద్యార్థులు సమయం వృథా కాకుండా బాసట ఆధ్వర్యంలో నైపుణ్యాల శిక్షణ అభినందనీయమన్నారు. ఎంఈఓలు ఎంవి నాగరత్నం, ఎన్.అరుణ కుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ప్రతిభ దాగి ఉంటుందని, దాన్ని వెలికి తీసి సాధన చేయడం అవసరమని అన్నారు. దేవాదాయ శాఖ మాజీ డిప్యూటీ కమిషనర్ పోపూరి గంగయ్య చౌదరి, బాసట గౌరవ సలహాదారులు ఆలోకం పెద్దబ్బాయి మాట్లాడుతూ శిక్షణ శిబిరం విద్యార్థులకు కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఇది దోహదపడిందని, నిర్వహణకు సహకరించిన నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ సృజన, డైరెక్టర్ పోపూరి వెంకటేశ్వర్లు (చిన్న)ను అభినందించారు. అనంతరం జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం జి.విజయ భారతి మాట్లాడారు. సొలస పాఠశాల ఉపాధ్యాయులు షేక్ జున్ను తాను వేసిన డ్రాయింగ్‌ను డిప్యూటీ డీఈఓకు బహూకరించారు. తొలుత పీటర్ మాస్టారు గేయాన్ని ఆలపించారు.



శిక్షణా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన బాసట విద్యా విభాగ కమిటీ సభ్యులు కేత రామబ్రహ్మం, కల్లూరు శ్రీనివాస్ (వాసు)ను వక్తలు అభినందించారు. మండల స్థాయిలో నిర్వహించిన స్కాలర్‌షిప్ టెస్ట్ విజేతలకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.20 వేలు, నాలుగో బహుమతి రూ.11 వేలు, ఐదో బహుమతిగా రూ.9 వేలు చొప్పున ప్రదానం చేశారు. ప్రతి స్కూల్‌కు జ్ఞాపికతపాటు కన్సోలేషన్ కింద రూ.వెయ్యి చొప్పున ఉత్తమ విద్యార్థికి అందించారు. శిక్షణ శిబిరంలో నిర్వహించిన వివిధ విభాగాల ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. బాసట ప్రధాన కార్యదర్శి సామినేని శ్రీనివాసరావు, సభ్యులు ముతవరపు రవీంద్రబాబు, రావూరి సుమన్, పోపూరి శ్రీనివాస్‌రావు, కోయ రామోజీరావు, రావిశెట్టి నాగేశ్వరావు, రిటైర్డ్ లెక్చరర్ జొన్నలగడ్డ శేషయ్య, లింగరావుపాలెం హెచ్‌ఎం కాసు రామిరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పసుపు రైతు కంట అకాల వర్షపు నీరు

వర్షం పాలైన వండి, ఆరబోసిన పసుపు

నష్టపోయాం ఆదుకోవాలని రైతుల వినతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

పచ్చని పసుపు అకాల వర్షాలకు తడిసి కటువుగా మారింది. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టిన పసుపు రైతు కంట అకాల వర్షపు నీరే కారుతుంది. కల్లాలలో వండి ఆర బోసిన పంట తడిసి, తడిసి రంగు మారింది. ఏప్రిల్, మే నెలలో అనేకసార్లు కురిసిన అకాల వర్షాలకు పసుపు పంట తడిసి ముద్దయింది. చేతికొచ్చిన పంట ధర చేజారి పోవ డంతో, ఇప్పటివరకు పసుపును అమ్ముకోని రైతులు ఆందో ళనలో ఉన్నారు. తడిసిన పసుపు రంగు మారి కటుకేసి పోయిందని, తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపు రించిందని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. కల్లాలలో తడిసిన పసుపును బయటకు తీసుకువచ్చి రోడ్లపై ఆరబెట్టుకుంటున్నారు. తడిసి ముద్దయిన పసుపు పంటను అదనపు కూలీల ఖర్చు తడిసి మోపెడవుతుందని తాడేపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో పసుపు రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం పసుపు క్వింటా 9,500 నుండి 10,500 వరకు ధర పలుకుతుంది. తడిసిన పసుపును కటుకు సాకుతో సగానికి సగం తక్కువ ధరకు అమ్ముకోవడమేనని రైతులు వాపోతున్నారు. అధికంగా పసుపు సాగు చేసిన కుంచనపల్లి గ్రామానికి చెందిన రైతు గాదె నారాయణ తాను పది ఎకరాల పసుపు పంట సాగు చేశానని తెలిపారు. కల్లాలలో వండి వార్చిన తర్వాత అకాల వర్షంతో పసుపు పంట మూడు నాలుగు సార్లు తడిసి ముద్దయిందన్నారు. తాను రూ. 3 లక్షల నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు. కల్లాలలో నుండి పసుపును రోడ్లపైకి తీసుకువచ్చి కూలీలతో ఆరబోయించటం, శుభ్రం చేయించడం అదనపు ఖర్చు అవుతుందని అన్నారు. పలువురు పసుపు రైతులు తాము అప్పుల ఊబిలో పడిపోయామని ప్రభుత్వమే చొరవ తీసుకొని, రైతుల వద్ద నుండి తడిసిన పసుపును ఆంక్షలు లేకుండా కొనాలని పలువురు పసుపు రైతులు కోరుతున్నారు.



కుంచనపల్లి లో తడిసి ముద్దైన పసుపు పంటను ఆరబెడుతున్న కూలీలు

బిజెపి దుష్టత్వాన్ని సంఘటితంగా ఎదుర్కోవాలి

మతసామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ, సమైక్యత సభలో నాయకుల పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి

బిజెపి దుష్ట ప్రయత్నాలను త్రిప్పి కొట్టాలని, దేశ సమగ్రత పరిరక్షణకై వామపక్షాలు, లౌకికవాదులు, మేధావులు సంఘటితంగా ఉండి తిప్పి కొట్టాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. పెహల్గామ్ లో ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా, మతసామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ సమైఖ్యత కోరుతూ మంగళవారం సాయంత్రం మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పరిరక్షణ కమిటీ, పాస్టర్స్ అసోసియేషన్, కాంగ్రెస్ పార్టీ, ముస్లిం ధార్మిక సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమైక్యత సభ, ర్యాలీ జరిగింది. సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, సిపిఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, సిపిఐఎంఎల్ నాయకులు కే కోటేశ్వరావు అధ్యక్షత వహించారు. ఈ సభలో రామారావు మాట్లాడుతూ పెహల్గాంలో ఉగ్రవాదుల దాడులను దేశవ్యాప్తంగా వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ, ఇక్కడ లౌకిక పార్టీలు ఖండించడం జరిగిందని అన్నారు. ఉగ్రవాదులు 26 మంది టూరిస్టులను చంపటం దారుణమని అన్నారు. నిఘవర్గాలకు ఉగ్రవాద చర్యలు ముందే తెలిసి హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం తగు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ముస్లిం అంటేనే ఉగ్రవాదులని బిజెపి, దాని అనుబంధ పరివార సంఘాలు మాట్లాడడం సబబు కాదని అన్నారు. మణిపూర్ లో 250 మంది హత్యలు, అత్యాచారాలకు గురైన సంఘటనలు ఉన్నాయని అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆ ప్రాంతాన్ని ఇంతవరకు సందర్శించలేదని విమర్శించారు. రెండు మూడు నెలల్లో కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు ఉండటం వలన ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని విమర్శించారు. ఉగ్రవాదుల దాడుల్లో చనిపోయిన వారి కటుంబాలను పరామర్శించకుండా, ప్రధాని నరేంద్ర మోడీ బీహార్ ఎన్నికల ప్రచారంలో ఉన్నారని విమర్శించారు. కాల్పులు విరమణ జరిగిన విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంపు ప్రకటించడానికి విమర్శించారు. ఈ ప్రకటన చేయడం వల్ల దేశ సార్వభౌమత్వానికి ఆటంకం కలిగిందని అన్నారు. భారత రాజ్యాంగంపై నరేంద్ర మోడీ ప్రభుత్వం దాడి చేస్తుందని విమర్శించారు. సిపిఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం సమైక్యతకు ముప్పు వాటిల్లుతుందని అన్నారు. సంఘపరివారశక్తులు దేశాన్ని మతాలవారీగా విభజించడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఉగ్రవాదుల దాడిలో కొంతమంది హిందువులను ముస్లిం సోదరులు కొంతమందిని తమ ప్రాణాలను అడ్డుపెట్టి కాపాడడం జరిగిందని అన్నారు. నరేంద్ర మోడీ దొంగల నాయకుడిగా ఉన్నారని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కలగజేసుకొని మాట్లాడుతుంటే దేశ ప్రధాని మోడీ నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. గుజరాత్ పెట్టుబడిదారుల వ్యాపారాల వరకు యుద్ధాన్ని నిలిపివేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు అయిన టిడిపి, జనసేన, వైయస్సార్ పార్టీలో మోడీ భజన చేస్తున్నాయని విమర్శించారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడింది కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలేనని అన్నారు. సభలో జేఏసీ కన్వీనర్ ఎండి యూసుఫ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కే జీవన్ సాగర్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి కె రామారావు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు బి రవి కిషోర్, పి తిమోతి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ నుండి గౌతమ్ బుద్ధ రోడ్డు మీదగా హాస్పిటల్ రోడ్డు, గాలిగోపురం మీదగా మెయిన్ బజార్, షాదు సోడా సెంటర్, పూల మార్కెట్ సెంటర్ మీదగా మిద్ది సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న పాశం రామారావు



బహిరంగ సభకు హాజరైన ప్రజలు

పట్టణంలో వీధికుక్కలను నియంత్రించలేరా?

సమావేశంలో కౌన్సిలర్ల ప్రశ్నల వర్షం

ప్రజాశక్తి - తెనాలి రూరల్

పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పశువులపై దాడి చేయడమే కాకుండా పిల్లలను, పెద్దలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కౌన్సిల్లో పలుమార్లు ప్రస్తావించినా పట్టించుకోవడం లేదు. అంటూ వైసిపి కౌన్సిలర్‌లు ఆవుల కోటయ్య, తాడిబోయిన రామయ్య, జనసేన పార్టీ కౌన్సిలర్ గోగిరెడ్డి మానస కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం కౌన్సిల్ హాల్లో చైర్ పర్సన్ తాడి బోయిన రాధిక అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశం ప్రారంభంలోనే కౌన్సిలర్లు వీధి కుక్కల సమస్యను లేవనెత్తడంతో ఆ సమస్యను పరిష్కారించేందుకు కుక్కలకు శస్త్రచికిత్సలు చేయిస్తున్నట్లు కమిషనర్ బండి శేషన్న బదులిచ్చారు. ఎప్పుడో ఒకసారి కుక్కలను పట్టడం వల్ల ప్రయాజనం ఉండదని, వైద్యుల సంఖ్యను పెంచి, శస్త్ర చికిత్సలు కూడా పెరిగేలా చర్యలు తీసుకుంటేనే పరిస్థితి అదుపులోకి వస్తుందంటూ మరో కౌన్సిలర్ తాడిపోయిన రామయ్య సూచించారు. అలాగే 13వ వార్డు కౌన్సిలర్ కుర్ర సుజాత తన వార్డులో ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ఇబ్బందికరంగా ఉందని తక్షణమే రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, అలాగే సచివాలయంలో సీలింగ్ దెబ్బతిందని దాని మరమ్మతులు చేపట్టాలని కోరారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదని, మూడు ముక్కలుగా చేసి టెండర్లు పిలచామని, సచివాలయంలో మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని ఎంఈ ఆకుల శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలో రోడ్లు, కాల్వలకు సంబంధించి నెలలు దాటుతున్నా కాంట్రాక్టర్లు పట్టించుకోవడంలేదని, వారిని బ్లాక్లిస్టులో పెట్టి కొత్తవారికి పనులు కేటాయించాలని టీడీపీ కౌన్సిలర్‌లు అడుసుమల్లి వెంకటేశ్వరరావు, పసుపులేటి త్రిమూర్తి కోరారు. బిల్లుల చెల్లింపులో జాప్యం వల్ల కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించటం లేదని, ఇప్పుడు బిల్లుల చెల్లింపులు ప్రారంభం కానున్నాయని అన్ని పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుం టామని కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం అజెండాలోని అంశాలు ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించటంతో సమావేశం ముగిసింది. సమావేశంలో వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, అసిస్టెంట్ కమిషనర్ వి లక్ష్మీపతిరావు, మేనేజర్ విల్సన్ జయకర్, ఎసీపీలు శివన్నారాయణ, వాణి, ఆర్‌వో రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బండి శేషన్న

జిల్లా ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు, గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 29 గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి డి.దుర్గాబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అపోలో ఫార్మసీ, జెడ్ఎం క్యూఆర్ కోడ్ సర్వీసెస్ జాబ్ డీలర్స్ కంపెనీలు పాల్గొంటా యన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, బి.టెక్, ఎంబిఎ, పీజీ చదివిన వారు, 35 సంవత్సరాల వయస్సు కలిగిన నిరుద్యోగులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్‌సైజు ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకూ ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు 98668 22697 నంబరులో సంప్రదించాలన్నారు.



కోర్టు తీర్పును అమలు చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ విషయంలో సెంట్రల్ లేబర్ ట్రిబ్యునల్ కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. తమకు రావలసిన బకాయిలు కోసం కార్మికులు చేస్తున్న దీక్షలు మంగళవారం నాటికి 175 రోజులకు చేరుకున్నాయి. దీక్షలో కె ఏడుకొండలు, కే ప్రశాంత్, కే ఆంజనేయులు, కే అంకమ్మ, వి రిబ్కా కూర్చున్నారు. దీక్షలను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పు ఎవరికైనా శిరోధార్యం అని చెప్పారు, ఫ్యాక్టరీ యాజమాన్యం, పాలక పార్టీలు కోర్టు తీర్పు ప్రకారం న్యాయం చేయవలసిన బాధ్యత వారిపై ఉండని వెల్లడించారు. ఆ మేరకు చర్యలు తీసుకుంటారని తాను ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిచ్చయ్య, కె అగ్గయ్య, సుబ్బారావు, బి సూర్యప్రకాశరావు, ఇస్రాయిల్, ఆశీర్వాదం, ఆ షిప్, గురవయ్య మరియు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న కెఆర్ సూర్యనారాయణ, ఇతర నాయకులు

5న ఎపిజిఇఎ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

విజయవాడలో జూన్ 3న జరిగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మూడవ కౌన్సిల్ సమావేశాలలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కౌన్సిల్ సమావేశాల ప్రచార కార్యక్రమంలో సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ సమావేశాలలో ఉద్యోగుల సమస్యలపై సమగ్రంగా చర్చించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు అవుతారని తెలిపారు. కావున ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జి. నాగసాయి , ఉపాధ్యక్షులు కేదార్ , వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామిరెడ్డి, గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి సుమిత్రాదేవి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ రవితేజ నాయక్‌తో మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ

హెల్త్‌కార్డుల ఇకెవైసిపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - రాజుపాలెం

ఆసుపత్రిలో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్య సిబ్బందికి పల్నాడు జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పద్మావతి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించిన ఆమె వైద్య సిబ్బంది హాజరు, మందుల నిల్వల రికార్డులు, రోగులకు అందిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. వైద్యాధికారి డాక్టర్ రవితేజ నాయక్‌తో పలు అంశాలపై చర్చించారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్, ఎన్సిడిసిడి సర్వే, ఆష్మాన్ భారత్ హెల్త్ కార్డ్స్ ఇకెవైసి సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టి నూరుశాతం పూర్తి చేయాలని చెప్పారు. గర్భిణుల నమోదు వివరాలు పరిశీలించారు. వడదెబ్బకు గురైన వారికి తగిన మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు.



కిశోరబాలికలతో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ తదితరులు

కెరీర్ గైడెన్స్‌పై కిశోరబాలికలకు అవగాహన

ప్రజాశక్తి - పెదకూరపాడు

కిశోర బాలికలకు కెరీర్ గైడెన్స్‌పై స్థానిక అంగన్వాడీ-2లో మంగళవారం అవగాహన కల్పించారు. పలు అంశాలపై ఐసిడిఎస్ సూపర్వైజర్ షేక్ మున్ని మాట్లాడారు. సైబర్ నేరాల గురించి వివరించారు. సాయి తిరుమల, శ్రీలక్ష్మి, స్రవంతి, చిన్నమ్మాయి, రజిని, స్వర్ణ, అస్మా, హుస్సేన్‌బి, సామ్రాజ్యం, నిర్మల పాల్గొన్నారు.



యోగా చేస్తున్న సాధకులు

జూనియర్ కాలేజీలో యోగా శిక్షణ

ప్రజాశక్తి - వినుకొండ

వచ్చేనెల 21 వరకు యోగా శిక్షణలో భాగంగా స్థానిక గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన శిక్షణలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడారు. యోగా వల్ల ఉపయోగాలను వివరించారు. కౌన్సిలర్ షకీలా మాట్లాడుతూ యోగా మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని చెప్పారు. ఎదుటి వారిపై అసూయ, కోపం, ద్వేషం లాంటి వాటిని మనసులో నింపుకోకుండా ఉంటామన్నారు. ప్రశాంత జీవనానికి యోగా యుపయుక్తమని, అందరూ యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, యోగా గురువులు, సాధకులు, వాకర్స్ పాల్గొన్నారు.

కట్టుకథలు అల్లి అక్రమ కేసులు : వైసిపి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మాచర్ల నియోజకవర్గంలో జరిగిన జంట హత్యల్లో నిందితులు టిడిపి వారే అయినా వైసిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని మాజీ మంత్రి విడదల రజిని మండిపడ్డారు. నరసరావుపేట పట్టణం లింగంగుంట్ల గ్రామ పరిధిలోని వైసిపి జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైసిపి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డితో కలిసి ఆమె మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏడాది నుండి రెడ్ బుక్ పాలనను అమలు చేస్తున్నారని, వైసిపి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. మాచర్ల నియోజక వర్గంలో జరిగిన జంట హత్యలు ఆధిపత్య పోరులో భాగంగానే జరిగాయని, ఇరుపక్షాలు టిడిపి వారేనని ఎస్పీ చెప్పారని గుర్తు చేశారు. ఈ హత్యలతో సంబంధం లేదని పిన్నెల్లి సోదరుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో తొలగించాలన్నారు. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కట్టు కథలను అల్లి పిన్నెల్లి సోదరులపై హత్యకేసు నమోదు చేయటం కూటమి ప్రభుత్వ ఆటవిక పాలనకు నిదర్శనమన్నారు. కూటమి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు వైసిపి వారిపై కేసులు పెడుతున్నారని విమర్శించారు. అక్రమ కేసులపై ఎస్పికి ఫిర్యాదుతోపాటు న్యాయ పోరాటం చేస్తామని అన్నారు. డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ వాగ్దానాలను నెరవేర్చలేక, ప్రజల దృష్టిని మరలించేందుకే కూటమి ఇలా వ్యవహరిస్తోందని అన్నారు. వేధింపులకు పాల్పడితే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.



మాట్లాడుతున్న విడదల రజిని, శ్రీనివాసరెడ్డి, భార్గవర్‌రెడ్డి

సహకార సంఘాల వృద్ధికి బాధ్యతగా కృషి

ప్రజాశక్తి - నరసరావుపేట

అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యంలో సామర్ధ్య నిర్మాణం - సుపరిపాలనపై ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కమిటీ సభ్యులకు, కార్యనిర్వాహక కార్యదర్శులకు నరసరావుపేట పట్టణం, ప్రకాష్‌నగర్‌లోని జిడిసిసి బ్యాంక్ కార్యాలయంలో మంగళవారం శిక్షణిచ్చారు. జిల్లా సహకార అధికారి ఎం.వెంకట రమణ మాట్లాడుతూ సహకార సంఘాల కమిటీ సభ్యులు, సిఈఓలు సహకార సంఘాల అభివృద్ధిలో ముఖ్య పాత్ర వహిస్తున్నారన్నారు. సహకార సంఘాలు సభ్యుల సహకారంతో నడిచే స్వయం ప్రతిపత్తి సంస్థలని, సంఘాల వృద్ధికి కమిటీ సభ్యులు, సిఈఓలు బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ విజయవాడ సహకార శిక్షణా కేంద్ర వైస్ ప్రిన్సిపాల్ ఎన్.వేదాంతరెడ్డి మాట్లాడుతూ సంఘ కార్యకలాపాల పర్యవేక్షణ, సరైన పాలనకు మార్గనిర్దేశం చేయడం కమిటీ సభ్యుల ముఖ్యవిధి అన్నారు. వార్షిక సాధారణ సభ, బడ్జెట్ ఆమోదం, ఆడిట్ నివేదికలకు ఆమోదం ఇవ్వడం కమిటీ విధి అని చెప్పారు. సభ్యుల సంక్షేమానికి నిర్ణయాలు తీసుకోవడం, సంఘ నిధుల వినియోగంపై కమిటీ సభ్యులు పర్యవేక్షించడం చేయాలన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కమిటీ నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సంఘం రోజువారీ పరిపాలనను కమిటీ సభ్యులు నిర్వహించాలన్నారు. సిఈఓలు కమిటీ నిర్ణయాలను అమలు చేయడం, సభ్యుల రికార్డులు, ఖాతాల నిర్వహణ, ప్రామాణిక పత్రాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. సంఘ ఆస్తులు, లావాదేవీల పర్యవేక్షణ కమిటీ సభ్యులతో పాటు సిఈఓలు కూడా బాధ్యత తీసుకోవాలని సూచించారు. సహకార రంగ అభివద్ధికి కమిటీ, సీఈఓలు పరస్పర సమన్వయంతో పని చేయడం ద్వారా సంఘాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికీ దోహదం చేస్తుందని చెప్పారు. జిల్లాలో అన్ని సహకార సంఘాలలో డిజిటల్ సేవలు అందుబాటులో ఉన్నాయని, తద్వారా సంఘాల ఆడిట్ సులభం అవుతుందని అన్నారు.కార్యక్రమంలో సహకార సంఘాల పర్సన్ ఇన్‌ఛార్జిలు సిఈఓలు పాల్గొన్నారు.



దేశ సమైక్యతను కాపాడుకుందాం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఉగ్రవాదాన్ని వ్యతిరేకిద్దామని, దేశ సమైక్యత సమగ్రతను కాపాడుదామని, ఇందులో భాగంగా దేశ సమైక్యత యాత్రలో పాల్గొందామని సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలో కరపత్రాల పంపిణీ చేసి మాట్లాడారు. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు బలయ్యారని, ఈ ఘటనను సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ఈ ఉగ్రదాడికి వ్యతిరేకంగా దేశ ప్రజానీకం ప్రదర్శించిన ఐక్యత, సమైక్యత స్ఫూర్తి ప్రజలందరినీ ఒక తాటిపైకి నిలిపిందని అన్నారు. మనుషులను వారి మతాన్ని తెలుసుకొని హత్య చేయడం ద్వారా ఉగ్రవాదులు దేశంలో మతపరమైన విభజనను తీసుకురావాలని, మతవిద్వేషాలు రెచ్చగొట్టాలని పథకం ప్రకారం ఈ దాడి చేశారని చెప్పారు. దేశ ప్రజలు సమైక్యంగా నిలబడి ఈ పథకాన్ని వమ్ము చేశారని, అయితే మతోన్మాద శక్తులకు ఇది నచ్చలేదని, ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటాన్ని వదిలేసి వక్రబుద్ధితో మతోన్మాదాన్ని, ముస్లిమ్ వ్యతిరేకతను రెచ్చగొట్టి దేశాన్ని బలహీనపరుస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఇలాంటి శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మతసామరస్యం కోసం, దేశసమగ్రత కోసం జరిగే సమైక్య యాత్రలో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జె.రాజ్ కుమార్, షేక్ మస్తాన్‌వలి, పి.ప్రభాకర్, జి.సుసులోవ్, జి.హనుమంతరావు పాల్గొన్నారు.

15 మంది 'కృష్ణవేణి' విద్యార్థులకు టిసిఎస్‌లో ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రఖ్యాత టిసిఎస్ (ఐటి)లో తమ విద్యార్థులు 15 మంది ఉద్యోగాలు సాధించారని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. తమ కళాశాలలో డిగ్రీ చివరి ఏడాది బిఎస్‌సి విద్యార్థులకు ఈ ఏడాది ఫిబ్రవరిలో టిసిఎస్ కంపెనీ ప్రతినిధులు ప్రాంగణ ఎంపికలు నిర్వహించగా ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూలు చేసి తాజాగా ఫలితాలు విడుదల చేశారని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో 48 మంది విద్యార్థులు పలు బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల అభినందన సభలో టిపిఒ ఎం.బాలకోటేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



అనుమతి లేకుండా లాకప్‌లో ఉంచొద్దు

- క్షేత్రస్థాయి సిబ్బందే పోలీస్ వ్యవస్థకు వెన్నెముక
- రొంపిచర్ల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దర్యాప్తులో ఉన్న కేసులను విచారణను సత్వరం పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయాలని రొంపిచర్ల పోలీసులను పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. మండల కేంద్రమైన రొంపిచర్లలోని స్టేషన్‌ను మంగళవారం సందర్శించిన ఆయన రికార్డులను తనిఖీ చేశారు. సిఐ పి.రామకృష్ణ, ఎస్ఐ మణికృష్ణతో మాట్లాడారు. అనుమతి లేకుండా లాకప్‌లో ఎవర్నీ ఉంచొద్దని, బాధితుల పట్ల మర్యాదగా మెలగాలని చెప్పారు. రాత్రి గస్తీకు వెళ్లే సిబ్బందితో మాట్లాడి గస్తీ ముమ్మరంగా జరిగేటట్లు చూడాలన్నారు. మద్యం, ఇసుక అక్రమ రవాణా, గంజాయి, ఇతర నిషేధిత పదార్థాల రవాణా, నిల్వపై దృష్టి సారించాలన్నారు. చోరీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ మహిళలపై నేరాలను అరికట్టాలని చెప్పారు. సైబర్ నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పోక్సో నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది యోగక్షేమాల విషయంలో ఏ సమస్య ఉన్నా నిత్యం తాను అందుబాటులో ఉంటానని, సంప్రదించాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బందే వ్యవస్థకు వెన్నెముకన్నారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సిఐ బి.సురేష్‌బాబు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

యోగాంధ్ర జయప్రదం కోసం ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21 నుండి జూన్ 21 వరకూ నెలరోజులపాటు చేపట్టిన యోగాంధ్ర-2025 కార్యక్రమాలలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బృందావన్ గార్డెన్స్ ఎన్‌టిఆర్ స్టేడియం నుండి లక్ష్మీపురం మథర్ థెరిస్సా విగ్రహం వరకు యోగాపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఇంచార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భార్గవ్‌తేజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్రలో భాగంగా జిల్లాలో యోగా శిక్షకులను గుర్తించి, వారి ద్వారా క్షేత్ర స్థాయి వరకు యోగాపై ప్రజలకు తెలియచేస్తామన్నారు. అలాగే పర్యాటక ప్రాంతాలైన ఉండవల్లి గుహలు, మంగళగిరి ఎకో పార్క్‌లలో కూడా పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజల్లో యోగా పట్ల అవగాహన కల్గించడం ద్వారా జూన్ 21 జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా చేయడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ జూన్ 21న వైజాగ్‌లో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో దేశ ప్రధాని పాల్గొంటారని, కావున వైజాగ్‌లో, అలాగే గుంటూరులో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనే వారు యోగాంధ్ర వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ర్యాలీలో డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి, డిపిఒ డాక్టర్ సైమన్, డిపిఎం(ఇంచార్జ్) ఎన్‌ఆర్‌హెచ్‌ఎం డా.జయరామ్‌కష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రం అలాగే చెంచుపేటలోని ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు శాఖల మున్సిపల్ సిబ్బంది, అధికారులకు యోగ శిక్షణపై అవహహన కల్పించారు. తెనాలి సహజ యోగ మెడిటేషన్ నుండి యోగా గురువు కొత్తమాసు వెంకట సురేష్ బాబు యోగాసనాల శిక్షణనిచ్చారు. తెనాలి మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



గుంటూరులో ర్యాలీలో పాల్గొన్న ఇన్‌ఛార్జి కలెక్టర్, నగర కమిషనర్

ప్రజాశక్తి - పెదకాకాని: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లబిస్తుందని ఎంపీడీవో ఆర్.శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని శివాలయంలోని కళ్యాణ మండపంలో యోగా శిక్షకులకు శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రజా పరిషత్ సిబ్బంది, పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల: మండలంలో నాలుగు గ్రామాలలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. దుగ్గిరాలలో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు ఈ ఓ పి ఆర్ డి జవహర్లాల్ నెహ్రూ సర్పంచ్ బాణావత్ ఖుషి భాయ్ వెంకటేశ్వర నాయక్ వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. చిలువూరు గ్రామంలో ప్రారంభమైన తరగతులను ఎంపీపీ షేక్ జబీన్ ప్రారంభించారు.

ప్రజాశక్తి - కొల్లిపర : ఆదిమండ వారి కళ్యాణ మండపంలో మొదటి రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ భీమవరపు పద్మావతి ప్రారంభించారు. ఈ సదర్భంగా తహశీల్దార్ సిద్ధార్ధ మాట్లాడుతు మండలంలోని కొల్లిపర, వల్లభాపురంలో యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన చైర్మన్ సాంబశివరావు

శ్రీకాశీఅన్నపూర్ణ సేవా ట్రస్ట్ వితరణ

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు ఆధ్వర్యంలో మంగళవారం మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానం మెట్ల మార్గంలో భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ గత 2 సంవత్సరాలుగా నిర్విరామంగా ప్రతి నెలా వచ్చే అమావాస్య సందర్భంగా తమ ట్రస్ట్ ద్వారా 40 మంది దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ సభ్యులు నంగళం ప్రసాద్, కర్నాటి శివ సత్యనారాయణ, ఖగ్గా శ్రీనివాసరావు, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, పంచల శివన్నారాయణ, మారం మల్లికార్జునరావు, కోరాడ శ్రీనివాసరావు, ఉద్దంటి మురహరిరావు, డోగిపర్తి శ్రీహరిరావు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థపై అవగాహన

ప్రజాశక్తి - మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరు లో చైల్డ్ రైట్స్ అడ్వేకెసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల అభివృద్ధి కార్యాలయం సమావేశ ప్రాంగణంలో బాల్య వివాహలు, బాల కార్మిక వ్యవస్థ, లైంగిక నేరాల నుండి బాలల రక్షణ చట్టాల పై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది.

ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి టి. చందన మాట్లాడుతూ బాలలకు వారి కనీస అవసరాలు అందే విధంగా చేయవలసిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. బాల్య వివాహము అంటే అమ్మాయికి 18 సంవత్సరాలు నిండకుండా, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేస్తే దాన్ని బాల్య వివాహంగా పరిగణిస్తామని తెలిపారు. దీనిని ఎవరైనా ఉల్లంఘిస్తే 2 సంవత్సరాలు జైలు శిక్ష మరియు రూ1 లక్ష జరిమానా విధించబడతాయని తెలిపారు. మేడికొండూరు మండల, గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చూడవలసిన బాధ్యత అందరిపై ఉందని తెలియజేశారు. సమావేశంలో క్రాఫ్ జిల్లా కో- ఆర్డినేటర్ కె.సమీర్ కుమార్, ఫిరంగిపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్, సిరిపురం సెక్టర్ సూపర్వైజర్ కె.కృష్ణకుమారి సెక్టార్ సూపర్వైజర్ టీ. హేమలత, చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్ - క్రాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ జి.వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో చందన

గోవధ నిరోధక చట్టం అమలుకు బృందాలు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో బక్రీదు పర్వదినాన్ని ప్రశాంత వాతవరణంలో, ఆంధ్రప్రదేశ్ గోవధ నిరోధక చట్టం 1977 నిబంధనలకు అనుగుణంగా జరుపుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జూన్ 7న జరిగే బక్రీదు పండుగ సందర్భంగా గుంటూరు జిల్లా జంతు హింస నివారణ సంఘం సమావేశాన్ని అధికారులు, జంతు హింస నిరోధక సంఘం ప్రతినిధులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ బక్రీద్‌నాడు గోవధ నిరోధించడానికి జిల్లాలోని అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు ఎట్టి పరిస్థితిలోను ఆవులను, చూలు పశువులను, 3 నెలల దూడలు కలిగి ఉన్న పశువులను వధించరాదన్నారు. జంతు రవాణా నిబంధనల మేరకు సరైన ధ్రువీకరణ పత్రం లేకుండా జంతువులను రవాణా చేయకూడదని, నిబంధనలకు లోబడి అనుమతించబడిన జంతువులను మాత్రమే నిర్దేశించిన జంతువధశాలలో మాత్రమే వధ చేయాలని, జంతువధ నిరోధక చట్టాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పి.సి.ఎ.చట్టం నిబంధనలు అమలు , పర్యవేక్షణకు నాలుగు బృందాలు, తెనాలి, పొన్నూరు, ఎం.టి.ఎం.సి పరిధిలో రెండు బృందాలు చొప్పున ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో పాల్గొన్న జంతు హింస నివారణ సంఘం సభ్యులు తెలిపిన పలు అంశాలపై జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ స్పందిస్తూ అనధికారికంగా, నిబంధనలకు విరుద్ధంగా జంతువులు రవాణా జరగకుండా పోలీస్, రవాణా శాఖ అధికారులు సమన్వయంతో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ గోవధ నిరోధక చట్టం, 1977 నిబంధనలు ఉల్లంఘించి కేసులు నమోదు చేసిన వారిని ముందస్తుగా పోలీస్ శాఖ వారు బైండోవర్ చేయాలన్నారు. సమావేశంలో సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ సుప్రజ, డిఆర్ఒ ఎన్ఎస్‌కే ఖాజావలి, డిపిఒ సాయికుమార్, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ డీడీ సత్యన్నారాయణ, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎస్ కే ఎం షరీఫ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థను కొనసాగించాలి

ఎమ్‌డియుఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి - మంగళగిరి

గత ప్రభుత్వం అమలు చేసిన ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే వాహనాల వ్యవస్థను అర్ధాంతరంగా రాత్రికి రాత్రే కూటమి ప్రభుత్వం నిలిపివేసిందని ఎం డి య ఎస్ ఏంటీఎంసీ ప్రెసిడెంట్ దోప్పలపూడి విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మంగళగిరి తాసిల్దార్ కార్యాలయం వద్ద ఎండి యుఎస్ ఆధ్వర్యంలో మార్కండేయ కళ్యాణమండపం నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎలాంటి సమాచారం లేకుండా ఎండియు వ్యవస్థను నిలిపివేయడంతో జీవన ఉపాధి కోల్పోయి18 వేల కుటుంబాలు వీధిన పడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఈ బీసీ కార్పొరేషన్ల ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిలో ఇంటింటికి రేషన్ పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2021 నుండి 2027 వరకు అగ్రిమెంట్ ఉన్న అర్ధాంతరంగా వాహనాలను రద్దు చేస్తున్నట్లు పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారని విమర్శించారు. హఠాత్తుగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆపరేటర్లు హెల్పర్లు జీవన ఉపాధి కోల్పోయి రోడ్డు పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు కరోనా వరదల సమయంలో ఎండియూలు ప్రజలకు చేసిన సేవలను కూటమి ప్రభుత్వం గుర్తించాలని వారు కోరారు. కాంట్రాక్ట్ నిబంధనల ప్రకారం 2027 వరకు వాహనాలను కొనసాగించాలని, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తూ మంగళగిరి తాసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో. మంగళగిరి రూరల్ సెక్రెటరీ తమ్మ సుధాకర్ రెడ్డి, తాడేపల్లి రూరల్ సెక్రటరీ వి రవికుమార్, హెల్పర్లు ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.


మంగళగిరిలో నిరసన తెలియజేస్తున్న ఎం డి య ఎస్ ఆపరేటర్లు

జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి : భారత తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా మంగళగిరి వడ్లపూడి సెంటర్లో ఉన్న జవహర్లాల్ నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ షేక్ సలీం ఇతర నాయకులు మంగళవారం నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశానికి నెహ్రూ బలమైన పునాది వేశారని అన్నారు. సామాజిక న్యాయం, ఆధునికత, విద్య, రాజ్యాంగం, ప్రజాస్వామ్య స్థాపనలో ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. నెహ్రూ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పథం అనే ఆదర్శాలు మనల్ని ముందుకు నడిపిస్తూనే ఉంటాయిని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కాపు సాధికారిక చైర్మన్ రేమిడ శెట్టిహనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ మహిళ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ షేక్ మున్ని,తాడేపల్లి మండల అధ్యక్షులు పఠాన్ సుభాని,మైనార్టీ నాయకులుచాంద్ బాషా పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల బాలల గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : మంగళగిరి మండలంలో ప్రత్యేక అవసరాలు గల బాల, బాలికలను గుర్తించేందుకు ఈనెల 15 నుండి సర్వే చేపట్టినట్లు ఐఈఆర్పీలు టి.జయలక్ష్మీ, డి.లక్ష్మీలు తెలిపారు. మంగళవారం కాజ గ్రామంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 9 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సర్వే జరుగుతుందన్నారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడమే సర్వే ఉద్దేశమని అన్నారు. ఎంఈవోలు కే.శ్రీనివాసరావు, ఎన్ బాబు పర్యవేక్షించారు.

పోలీసుల తీరుపై నేడు నిరసన

ప్రజాశక్తి తెనాలి : పట్టణంలో పోలీసుల అత్యుత్సాహాన్ని నిరసిస్తూ తెనాలి డివిజన్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు అయితా నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టినట్లు జేఏసీ సభ్యులు బొనిగల ప్రదీప్ మంగళవారం తెలిపారు. ఓ కేసులు నిందితులైన దళిత, ముస్లిం యువకులపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేయడానికి ఖండిస్తున్నామని, మానవహక్కుల ఉల్లంఘనను నిరసిస్తూ చేపట్టిన ర్యాలీలో ప్రజాస్వామ్యవాదులు పాల్గొనాల్సిందిగా పిలుపునిచ్చారు.

మహనీయుల చరిత్రను తెలుసుకోవాలి

ప్రజాశక్తి - పెదకాకాని : మహనీయుల చరిత్ర ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని రిసోర్స్ పర్సన్ భాను విద్యార్థులకు తెలియజేశారు. పెదకాకాని గ్రంథాలయంలో విద్యారులకు వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మహనీయుల జీవిత చరిత్రల విద్యార్థులకు వివరించారు.



కమ్యూనిటీ హాలుకు స్థలం కేటాయించాలి

తాహశీల్దార్‌కు నాయి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు వినతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

నాయిబ్రాహ్మణులకు కమ్యూనిటీ హాలు స్థలం ఏర్పాటు చేయాలని కోరుతూ, మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని తాడేపల్లి మండల తాసిల్దార్ కార్యాలయం లో తాసిల్దార్ డి సీతారామయ్యను నాయి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ తాడేపల్లి మండల అధ్యక్షులు తెంపల్లి దుర్గారావు మాట్లాడుతూ మండలంలో 900 కుటుంబాలు నాయి బ్రాహ్మణుల కుటుంబాలు ఉన్నాయని అన్నారు. వత్తి శిక్షణకు, నిద్రలు చేయడానికి ఎక్కడా కమ్యూనిటీ హాల్ లేనందున నాయి బ్రాహ్మణులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తమ సమస్యను స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ దష్టికి తీసుకువెళ్లి, మండలంలో ఏ ప్రాంతంలోనైనా కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని నాయి బ్రాహ్మణ సంఘం కోరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు పతకమూరి రామకోటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి విజయ్, లక్ష్మణ్, కావూరి నరసింహారావు, కోశాధికారి పాతూరి నాగబాబు, రవి, నాని తదితరులు పాల్గొన్నారు.

సిఎస్‌సి విభాగంలో రామకృష్ణకు పిహెచ్‌డి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ లో పరిశోధన చేసినందుకు పాలడుగు రామకృష్ణకు పిహెచ్‌డి డిగ్రీని ప్రధానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ ఇన్చార్జి కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్ వర్సిటీలో మంగళవారం తెలిపారు. ఇన్చార్జి వీసి ఆచార్య కే .గంగాధర రావు పరిశోధన పర్యవేక్షణలో టెక్స్ట్ క్లస్టరింగ్ అండ్ డాక్యుమెంట్ క్లాసిఫికేషన్ టెక్నిక్స్ యూజింగ్ డీప్ కాంటెక్స్ అండ్ ఎక్స్ టెన్ డెడ్ గ్లోవ్ మెథడ్ అనే అంశంపై రామకృష్ణ పరిశోధన గ్రంథం సమర్పించారు. ఈ సందర్భంగా విభాగం అధ్యాపకులు పరిశోధకులు రామకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు.

న్యాయవాదిని కొట్టిన పోలీసులను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

తెనాలిలో నలుగురు యువకులపై పోలీసుల దాష్టికాన్ని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.శాంతకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. పోలీసుల హింసకు గురైన వారిలో ముగ్గురు దళిత, మరొక మైనార్టీకి చెందిన యువకుడు ఉన్నారని తెలిపారు. వీరిలో జాన్ విక్టర్ యువకుడు న్యాయవాదిగా ఎపి బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నాడని ఒక న్యాయవాదిని రౌడీషీటర్ అని కొట్టడం దారుణం అన్నారు. పోలీసు అధికారులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం తగదన్నారు. జాన్ విక్టర్‌తో పాటు నలుగురు యువకులను కొట్టిన సిఐలు రాములునాయక్, రమేష్, పలువురు కానిస్టేబుళ్లను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గుంటి సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షురాలు గీతావాణి, నగర అధ్యక్షులు మెఘల్ కాలేషా బేగ్ తదితరులు ప్రకటనపై సంతకాలు చేశారు.

బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

పోస్టల్ సూపరింటెండెంట్ యలమందయ్య

ప్రజాశక్తి-గుంటూరు

సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్‌ను అనుసంధానం, ఎన్‌పిసిఐ లింకు చేయటానికి తప్పనిసరి అయినందున ప్రతి ఒక్కరూ అనుసంధానం చేసుకోవాలని గుంటూరు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ యు.యలమందయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాల నగదు నేరుగా బ్యాంక్ ఖాతాకు జమ చేయటానికి ఎన్‌పిసిఐ మ్యాపర్‌లో ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. అయితే మన రాష్ట్రంలో సుమారు 51 లక్షల మందికి వారి బ్యాంక్ అకౌంటెంట్‌కు ఆధార్ సీడింగ్ లేని కారణంగా గత సంవత్సరంలోనే జిఎస్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్, పోస్టల్ డిపార్ట్‌మెంట్ వారు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కొంత పురోగతి సాధించామని, ఇంకా చాలా మందికి ఆధార్ అనుసంధానం కాలేదన్నారు. ఈ నేపథ్యంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌ను సచివాలయ యంత్రాంగం, ప్రభుత్వ అధికారుల సమన్వయంతో జూన్ 5వ తేదీలోగా అందరికీ ఆధార్ సీడింగ్‌తోపాటు, ఎన్‌పిసిఐ లింకేజ్ చేస్తూ ఖాతాలను ఓపెన్ చేయటం ద్వారా సంక్షేమ పథకాలు ఇబ్బంది లేకుండా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ఆధార్ సీడింగ్ జరిగిన భారతీయ పోస్ట్ చెల్లింపు బ్యాంకు (ఐపిపిబి)ఖాతాలో జమ అయిన పథకాల నగదును పోస్ట్ ఆఫీసులో తీసుకునే సదుపాయంతోపాటు ఫోన్‌పే, గూగుల్‌పే వంటి యాప్‌లకు లింక్ చేసుకొని, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లు నెఫ్ట్, ఐఎంపిఎస్, యుపిఐ కూడా చేసుకునే సౌకర్యం కూడా ఉందన్నారు. ఆధార్ సీడింగ్ కాని వారు వెంటనే తమ దగ్గరలోని పోస్టాఫీసులో సంప్రదించి, రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలకు సిద్ధంగా ఐపిపిబి అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ చేసుకోవాలన్నారు.

ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన ఇన్‌ఛార్జి కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు



గోడౌన్‌ను పరిశీలిస్తున్న భార్గవ్‌తేజ

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీలలో భాగంగా మంగళ వారం గుంటూరు కలక్టరేట్ ఆవరణలోని ఇవియంలు భద్రపరిచిన గోడౌన్‌ను జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ తనిఖీ చేసారు. సీసీ టీవి పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. గోడౌన్ వద్ద భద్రత సిబ్బంది లాగ్‌బుక్ ను పరిశీలించారు. ఇవియంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఆదేశించారు. ఇవియంల పరిశీలనలో డిఆర్‌ఓ ఎన్ఎస్‌కే.ఖాజావలి, ఆర్డిఓ కె. శ్రీనివాస రావు, అడిషనల్ జిల్లా అగ్నిమాపక అధికారి కె.కష్ణా రెడ్డి, గుంటూరు పశ్చిమ మండల తహాశీల్దార్ కె.వేంకటేశ్వర రావు, ఆర్ అండ్ బి ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.నాగేశ్వర రావు, ఎలక్ట్రికల్ డివిజన్ డిఈ ఏ.కాళీ మాత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.అనంతరం గుంటూరు ఆర్‌డిఓ కె.శ్రీనివాసరావు రేపూడి వ్యవసాయ మార్కెట్‌లో భద్రపరిచిన ఈవిఎంలను , వివి ప్యాట్‌లను తనిఖీ చేశారు.

టెండర్లు పొందిన పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో వర్షాల వలన లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా టెండర్ పొందిన పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారుల్ని ఆదేశించారు. మంగళవారం కమిషనర్ విద్యానగర్, కష్ణనగర్ ప్రాంతాల్లో పర్యటించి, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల వారీగా టెండర్లు పూర్తి అయిన పనులను జాప్యం లేకుండా జరిగేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో జాప్యం జరిగితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని, కావున ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నూతన బహుళ అంతస్తు భవన నిర్మాణదారులు తప్పనిసారిగా డ్రైన్‌ని మేజర్ డ్రైన్‌లోకి అనుసంధానం చేసేలా, ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో ఏసిపి రెహ్మాన్, టిపిఎస్ సత్యనారాయణ, శానిటరీ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎఎన్‌యుకు జాతీయ, అంతర్జాతీయ ర్యాంకులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు



జాతీయ స్థాయిలో ది వీక్ - హన్సా రీసెర్చ్ బెస్ట్ యూనివర్సిటీ సర్వే - 2025 ర్యాంకింగ్స్ మల్టీడిసిప్లినరీ యూనివర్సిటీ కేటగిరిలో ఏఎన్ యూ జాతీయ స్థాయిలో13 వ ర్యాంకు, సౌత్ జోన్ స్థాయిలో 6 ర్యాంకును, రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకును కైవసం చేసుకుంది. ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఇంటెలెక్ట్యువల్ రిసోర్సెస్, ఫాకల్టీ, రీసెర్చ్, అకాడమిక్ ప్రోగ్రామ్స్, స్టూడెంట్ అడ్మిషన్స్, ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్, ఎక్ స్ట్రా కర్యూలర్ ఆక్టివిటీస్, ప్లేస్మెంట్స్ ఆధారంగా ర్యాంకులను కేటాయించడం జరిగింది. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది కృషి వల్లే ఈ ర్యాంకు సాధ్యమైందని వీసీ పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ది టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్, యూ.కే అద్వర్యంలో ప్రకటించిన ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్ - 2025లో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అంతర్జాతీయంగా బ్యాండ్ 600 ర్యాంక్‌ని సొంతం చేసుకుంది. పనితీరు సూచికలు బోధన, పరిశోధన వాతావరణం నాణ్యత తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ర్యాంక్ లను విడుదల చేసిందని వర్సిటీ విసి కె గంగాధర్‌తెలిపారు. ఈ సందర్భంగా విసి, రిజిస్ట్రార్ జి సింహాచలం, డాక్టర్ రవి, ఆర్కిటెక్చర్ కళాశాల బోధనా సిబ్బంది మరియు తదితరులు పోస్టర్ ఆవిష్కరించారు.

లక్ష టన్నుల సేకరణ అనంతరం ఇసుక సరఫరా

పల్నాడు ఇసుక కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు

జిల్లాలో ఉన్న ఇసుక రీచ్‌ల ద్వారా లక్ష టన్నుల ఇసుక సేకరణ అనంతరం ఇసుక సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నరసరావుపేట కలెక్టరేట్‌లో 8వ జిల్లా స్థాయి ఇసుక కమిటి సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం 60 వేల టన్నుల ఇసుక మల్లాది, కోనూరు యార్డులలో ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇసుక రీచ్‌ల నుండి స్టాకు పాయింట్ల వరకు ఇసుక రవాణాకు టన్నుకు చెల్లించే పైకంపై సత్వరమే నిర్ధారణ చేయాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా మైనింగ్ - గనుల శాఖాధికారి నాగిని ని ఆదేశించారు. అదే విధంగా చిలకలూరిపేట, వినుకొండ, మాచర్ల వద్ద స్టాక్ యార్డులు ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలాన్నారు. తంగేడ, పొందుగల, విజయపురి సౌత్ వద్ద ఉన్న ఇసుక పాయింట్ లవద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రానున్న రోజులలో ఇసుక స్థాక్ యార్డుల వద్ద రాత్రిపూట వాచ్ మెన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అడిషనల్ ఎస్.పి జెవి.సంతోష్, సత్తెనపల్లి రెవిన్యూ డివిజినల్ అధికారి రమాకాంత్ రెడ్డి,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి సూచీలలో వాస్తవాలు గుర్తించాలి

మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

భారత దేశం అనేక అంశాల్లో ఉన్న వెనుకబాటు తనాన్ని కప్పిపుచ్చి, ప్రచార్భాటం చేసే పాలకుల చర్యలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి అన్నారు. మంగళవారం రామన్నపేటలోని జనచైతన్య వేదిక హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లక్ష్మణరావు మాట్లాడుతు నీతి అయోగ్ సీఈవో బి.వి.ఆర్.సుబ్రహ్మణ్యం భారతదేశ స్థూల జాతీయోత్పత్తి 4.18 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో 4వ స్థానానికి చేరిందని, త్వరలో జర్మనీని అధిగమించి 3వ స్థానానికి చేరుకుంటుందని గొప్పగా ప్రకటించారని, అయితే లోతుగా వెళ్లి పరిశీలిస్తే ప్రపంచంలో బాగా వెనుకబడిన దేశాలతో పోటీ పడుతున్నామని అర్థమౌతుందని అన్నారు. మన దేశంలో ఒక్క శాతం ప్రజల చేతుల్లో 22 శాతం ఆదాయం ఉందని, అట్టడుగున ఉన్న 50 శాతం ప్రజల వద్ద కేవలం 13 శాతం ఆదాయం మాత్రమే ఉండటం మన దేశ ఆర్థిక అసమానాతలకు దర్పణం పడుతుందన్నారు. ప్రపంచంలోని ప్రతి ముగ్గురు నిరక్షరాస్యలలో, ప్రతి ముగ్గురు పేదలలో, ప్రతి ముగ్గురు నిరుద్యోగ్యులలో ఒకరు భారతీయుడిగా కొనసాగటం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. వాస్తవ పరిస్థితులు ఇలా ఉంటే 6 కోట్ల జనాభా ఉన్న ఇంగ్లాండ్ స్థూల జాతీయోత్పత్తి కన్నా ఎక్కువగా ఉన్నామని ప్రచారం చేసుకోవటం అర్థరహితం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులను బలోపేతం చేయడం మాని, ఆర్థిక అసమానతలు, పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగిత లాంటి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ 1990లో భారతదేశం, చైనా ఆర్థిక వ్యవస్థలు సమానంగా ఉండేవని, నేడు చైనా మనకన్నా తలసరి ఆదాయంలో, స్థూల జాతీయోత్పత్తిలో దాదాపు 5 రెట్లు ఎక్కువగా ఉన్నదన్నారు. మానవ వనరుల అభివద్ధి సూచికలో 193 దేశాలను పరిశీలిస్తే భారతదేశం 130వ స్థానంలో, ప్రపంచ పౌష్టిక ఆహార సూచికలో 127 దేశాలలో 105వ స్థానంలో, అక్షరాస్యతలో 127 దేశాలలో 106వ స్థానంలో, ప్రపంచ ఆహార భద్రతలో 113 దేశాలలో 68వ స్థానంలో, శ్రామిక ఉత్పాదకతలో 190 దేశాలలో ఇండియా 133 స్థానంలో, జెండర్ అసమానతల సూచికలో 133 దేశాలలో 108వ స్థానంలో, ఆర్థిక అసమానతల సూచికలో 127వ స్థానంలో కొనసాగడం వాస్తవిక పరిస్థితికి నిదర్శన మన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ డిఎఆర్ సుబ్రహ్మణ్యం, అడపా వేణుగోపాల్ పాల్గొన్నారు

కవిత్వ రచనకు సాహిత్య రీతులనూ పరిశీలించాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా రచయితల సంఘం ప్రతినెలా నిర్వహిస్తున్న కవిత్వంతో కాసేపు కార్యక్రమాన్ని మంగళవారం సంఘ సభ్యురాలు డాక్టర్ మైలవరపు లలితకుమారి ఇంట్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కవిత్వం మనుషులను కలుపుతుందని, కవిత్వం రాయాలనుకునే వారు కవిత్వాన్నే కాక ఇతర సాహిత్య రీతులను చదివి పరిశీలించటం చాలా అవసరమన్నారు. కవిత్రయంలో తిక్కన రచనా శైలిలోని ఉపమాన ఉపమేయ పదాల పొందికను గుర్తు చేశారు. మన తెలుగు వాడు తెనాలి వాడైన సంజీవ్‌దేవ్, అతని గురువైన రాహుల్ సాంకృత్యాయన్ గురించి వారి రచనలు చదవాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. శ్రీవశిష్ట సోమేపల్లి మాట్లాడుతూ కవులందరూ కలవటం, కవిత్వం గురించి చర్చించటం ఉత్సాహం కలిగిస్తుందన్నారు. అనంతరం కవులు తమ స్వీయ కవితలతో పాటు ఇతర కవుల కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో కవులు తాటికోల పద్మావతి, సుభద్రాదేవి, మెట్టు శ్రీనివాస్ రెడ్డి, సి.సురేష్, బండికల్లు జమదగ్ని, కొణతం నాగేశ్వరరావు, మైలవరపు రామశేషు, నానా, ఎస్.ఎం.సుభాని పాల్గొన్నారు.



కవిత్వంతో కాసేపు కార్యక్రమంలో పాల్గొన్న కవులు, సాహితీవేత్తలు